కాంగ్రెస్ అవినీతిని బయటపెడ్తాం

- హామీలు అడిగిన నిరుద్యోగులపై లాఠీలా?
- వారి సమస్యలపై నేడు అడ్జెంట్మెంట్ మోషన్
- రైతు రుణమాఫీ, రైతు భరోసాపై నిలదీస్తం
- 4వేల పింఛన్ ఎటుపాయె?
- 25, 26న మేడిగడ్డ, కన్నెపల్లి పర్యటన
- ప్రజాసమస్యలపై కేసీఆర్ సారథ్యంలో పోరాటం
- తెలంగాణకు నిధుల్లో రేవంత్‌రెడ్డి సత్సంబంధాలు ఏమైనయ్?
- మాజీ మంత్రి హరీశ్‌రావు ఫైర్

తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, చిత్రంలో ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, చింతా ప్రభాకర్, కోవ లక్ష్మి, విజయుడు, ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, సత్యవతి రాథోడ్, సురభి వాణీదేవి

హైదరాబాద్, జూలై 23 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరుగుతున్న అవినీతిని అసెంబ్లీ సాక్షిగా బయటపెడతామని, నిండు సభలోనే కాంగ్రెస్ కుంభకోణాల బండారాన్ని బట్టబయలు చేస్తామని మాజీ మంత్రి హరీశ్‌రావు తేల్చిచెప్పారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన జరిగిన బీఆర్ఎస్ ఎల్పీ సమావేశం అనంతరం హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. శాసనసభ సమావేశాల్లో బీఆర్ఎస్ వ్యూహాలను తమ అధినేత ఖరారు చేసినట్టు తెలిపారు. బీఆర్ఎస్ తరపున అడ్జెంట్మెంట్ మోషన్లు, కాలింగ్ అటెన్షన్లు, షార్ట్ డిస్కషన్ కింద ఏయే అంశాలు చర్చకు పెట్టాలో, ఏయే అంశాలపై ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలో వంటి అంశాలతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి లోతైన చర్చ చేసినట్టు వెల్లడించారు.

నిరుద్యోగుల సమస్యలపై వాయిదా తీర్మానం

> ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయక లక్షలాది మంది విద్యార్థులతో ప్రభుత్వం చెలగాటమాడుతున్నది. యాజమాన్యాలు సర్టిఫికెట్లు, టీసీలు ఇవ్వకపోవడంతో విద్యార్థులు రోడ్లపైకి వచ్చి ఆందోళన చేస్తున్నరు. -మాజీ మంత్రి హరీశ్‌రావు

నిరుద్యోగ యువతకు ఎన్నో ఆశలు పెట్టి ఇప్పుడు వారికి కాంగ్రెస్ తీరని ద్రోహం చేసిందని హరీశ్ మండిపడ్డారు. తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అడుగుతున్న నిరుద్యోగుల వీపులను పగులగొడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఏకంగా ఉస్మానియా హాస్టళ్లలో అర్ధరాత్రి చొరబడి దాడులు చేయడం, అక్రమంగా అరెస్టు చేయడం దారుణమని, అక్రమ కేసులు పెట్టి ప్రభుత్వం వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని బీఆర్ఎస్ సీరియస్‌గా తీసుకున్నదని, నేడు సభలో ఇదే అంశంపై వాయిదా తీర్మానం ఇచ్చి చర్చ జరగేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని చెప్పారు. లక్షలాది మంది నిరుద్యోగులకు కాంగ్రెస్ వెన్నుపోటు పొడించిందని విమర్శించారు. గ్రూప్ 2, 3 పోస్టులు పెంచాలని, జాబ్ క్యాలెండర్ వేయాలని, నిరుద్యోగులపై అక్రమ కేసులు ఎత్తివేయాలని, వారిని బూతులు తిట్టి దాడిచేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని సభలో పట్టుపడుతామని తెలిపారు.

వడ్ల అమ్మకంలో పెద్ద కుంభకోణం

సివిల్ సప్లయీస్ విభాగంలో వడ్ల అమ్మకంలో పెద్ద కుంభకోణం జరిగిందని హరీశ్ తెలిపారు. మూడు నెలల్లో వడ్లు ఎత్తుతామని, డబ్బులు చెల్లిస్తామని చెప్పి ఎవరికి టెండర్ కట్టబెట్టారు? అని ప్రశ్నించారు. ఇంతవరకు ఎన్ని డబ్బులు వచ్చినయ్? వడ్లు ఎత్తారా? మిల్లర్ల దగ్గర వడ్లు తీసుకున్నారా? అనేవి చర్చిస్తామని చెప్పారు. రూ.వందల కోట్ల కుంభకోణంపై కూడా వాయిదా తీర్మానం, షార్ట్ డిస్కషన్‌లో చర్చిస్తామని తెలిపారు. అవినీతి వెనుకఉన్న అదృశ్య శక్తులు ఎవరనేదానిపై మొత్తం బండారం బట్టబయలు చేయాలని, సివిల్ సప్లయీస్ కుంభకోణంపై పోరాడి విషయాలు బయటికి తీయాలని నిర్ణయించినట్టు తెలిపారు. సన్నబియ్యం కుంభకోణం మరీ దారుణమని హరీశ్ అభివర్ణించారు. సన్నబియ్యం కొనుగోలు టెండర్లు రూ.57కే ఇచ్చారని, మిల్లర్లు రూ.47కే ఇస్తామంటే రూ.57కు ఎలా ఇస్తారని, కిలోకు రూ.10చొప్పున ఎలా కుమ్మక్కయ్యారని ప్రశ్నించారు. సన్నబియ్యంలో కూడా వేల కోట్ల అవినీతి జరిగిందని విమర్శించారు. దీనిపై బీఆర్ఎస్ గట్టిగా పోరాడితే టెండర్‌ను అబయెన్స్‌లో పెట్టామన్నారే తప్ప ఎందుకు రద్దు చేయలేదని ప్రశ్నించారు.

ఎక్సైజ్‌శాఖలో అదృశ్య శక్తులెవరు?

ఎక్సైజ్‌శాఖలో కొన్ని మద్యం కంపెనీలకు అనుమతులిచ్చే అంశంపై భారీ కుంభకోణం, అవినీతి జరగిందని హరీశ్‌రావు తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో బ్లాక్ లిస్టులో ఉన్న సోం డిస్టిలరీస్‌ను మన రాష్ట్రంలో ఎలా అనుమతించారని ప్రశ్నించారు. ఓవైపు మంత్రి జూపల్లి కృష్ణారావు తనకు తెలియకుండానే అనుమతులిచ్చారని అంటున్నారని, ఆయనకే తెలియకుండా అనుమతులిచ్చే అదృశ్యశక్తులు ఎవరు? అనే విషయంపై చర్చించేందుకు సిద్ధమైనట్టు తెలిపారు. ఈ అనుమతుల వెనుక కమీషన్ ఎన్ని చేతులు మారిందనే విషయాలు బయటపెడతామని చెప్పారు. తాము గట్టిగా పోరాడితే తాత్కాలికంగా హోల్డ్‌లో పెట్టారే తప్ప ఎందుకు రద్దు చేయలేదని? దీనిపై నిలదీస్తామని వివరించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎందుకివ్వడం లేదు?

ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో లక్షలాది మంది విద్యార్థులతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటమాడుతున్నదని, అన్ని జిల్లాల్లో విద్యార్థులు ధర్నాలు, రాస్తారోకోలు చేస్తున్నారని హరీశ్ తెలిపారు. డబ్బులివ్వకపోతే యాజమాన్యాలు సర్టిఫికెట్లు, టీసీలు ఇవ్వడం లేదని చెప్పారు. ఈ ప్రభుత్వం విద్యార్థులను, నిరుద్యోగులను రోడ్డుపైకి తెచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. *పేదల పొట్టకొడుతరా?

అవ్వాతాతలకు రూ.4వేల పెన్షన్ ఇస్తామని, వందరోజుల్లో అమలు చేస్తామని, ఇంటికి రెండు పెన్షన్లు ఇస్తామని, ఇంట్లో ఉద్యోగమున్నా పెన్షన్ ఇస్తామని, కొత్త పెన్షన్లు ఇస్తామని చెప్పి ఇప్పుడు 2వేలు కూడా ఇవ్వడం లేదని హరీశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పెన్షన్లన్నీ ఎప్పుడిస్తారో చెప్పాలని పేదల పక్షాన ప్రభుత్వాన్ని నిలదీయాలని నిర్ణయించినట్టు తెలిపారు. దివ్యాంగులకు రూ.6వేలు ఇస్తామని చెప్పి వాళ్లకు కూడా అన్యాయం చేశారని, వందరోజులు అని చెప్పి 300 రోజులు దగ్గర పడుతున్నా హామీలకు అతీగతీ లేదని దుయ్యబట్టారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు రూ.6వేల పెన్షన్ ఎప్పట్నుంచి ఇస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. వీటితోపాటు శాంతిభద్రతలు, ఓవర్సీస్ స్కాలర్‌షిప్ వంటి అంశాలను కూడా ప్రస్తావిస్తామన్నారు.

> అవ్వతాతలకు 4వేలు, దివ్యాంగులకు 6వేల పింఛన్ ఇస్తమన్నరు. కొత్త పింఛన్లు అన్నరు. వందరోజుల్లోనే అమలు చేస్తమని చెప్పి 300 రోజులు దగ్గరపడుతున్నా ఉన్న 2వేలు కూడా ఇస్తలేరు. - మాజీ మంత్రి హరీశ్‌రావు

నీ సత్సంబంధాలు ఏమైనయ్?

సీఎం తన అసమర్థత కప్పి పుచ్చుకునేందుకు తమపై ఆరోపణలు చేయడం పెద్ద జోక్ అని హరీశ్ అన్నారు. తాము ఎన్నోసార్లు నిధుల కోసం కేంద్రానికి దండం పెట్టినట్టు గుర్తుచేశారు. రాష్ట్రానికి నిధుల కోసం సీఎం తన 8 మంది ఎంపీలతో పోరాటం చేయించాలని, తెలంగాణకు నిధులు ఎందుకు ఇవ్వరనే అంశంపై పార్లమెంట్‌లో రాహుల్ గాంధీతో మాట్లాడించాలని డిమాండ్ చేశారు. అవసరమైతే ప్రధాని కార్యాలయం ముందు ధర్నా చేయించాలని చెప్పారు. రాష్ట్రానికి ఒక్క ప్రాజెక్టయినా సాధించడంలో సీఎం అసమర్థత స్పష్టంగా కనిపించిందని దుయ్యబట్టారు. 'నీ సత్సంబంధాలు ఏడపోయినయ్?'.. పక్క రాష్ట్రాలకు నిధుల వర్షం కురుస్తుంటే.. నీకెందుకు మొండిచెయ్యిచ్చారు? అది ఫెల్యూర్ కాదా?' అని రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు.

బడ్జెట్ అనంతరం ప్రాజెక్టుల పరిశీలన

25న బడ్జెట్ తర్వాత మేడిగడ్డ ప్రాజెక్టు, కన్నెపల్లి పంప్‌హౌస్ పరిశీలనకు వెళ్లాలని కేసీఆర్ నిర్ణయించినట్టు హరీశ్ తెలిపారు. గోదావరిలో వరద ప్రవాహం నేపథ్యంలో కన్నెపల్లి పంపులు ఆపరేట్ చేసి, రైతులకు నీరందించాల్సి ఉన్నా ప్రభుత్వం ఆ పనిచేయడం లేదని, సర్కారు మొండి వైఖరితో అన్నదాతలు నష్టపోతున్నారని చెప్పారు. దీన్ని ప్రజలకు తెలుపాలని, కొండపోచమ్మ, మల్లన్న, రంగనాయక్ సాగర్, అనంతగిరి, మిడ్‌మానేరు, ఎస్సారెస్పీ, ఎల్ఎండీకి నీళ్లు మళ్లించేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు. బడ్జెట్ తర్వాత బీఆర్ఎస్ శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులు అంతా కలిసి మేడిగడ్డకు వెళ్తారని తెలిపారు. 25, 26 తేదీల్లో పర్యటన ఉంటుందని చెప్పారు. ఎల్ఎండీలో ఐదు టీఎంసీల నీళ్లు కూడా లేవని, మిడ్‌మానేరులోనూ నీళ్లు లేక సాగు, తాగు నీటికి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అనంతగిరి, రంగనాయక్‌సాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ బోసిపోతున్నాయని వాపోయారు.

> ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయక లక్షలాది మంది విద్యార్థులతో ప్రభుత్వం చెలగాటమాడుతున్నది. యాజమాన్యాలు సర్టిఫికెట్లు, టీసీలు ఇవ్వకపోవడంతో విద్యార్థులు రోడ్లపైకి వచ్చి ఆందోళన చేస్తున్నరు. -మాజీ మంత్రి హరీశ్‌రావు

> వడ్ల కొనుగోళ్లలో పెద్ద కుంభకోణం జరిగింది. మూడు నెలల్లో వడ్లు ఎత్తుతమని, డబ్బులు చెల్లిస్తమని చెప్పి ఎవరికి టెండర్ కట్టబెట్టిన్రు? ఇంతవరకు ఎన్ని డబ్బులు వచ్చినయ్? మిల్లర్ల దగ్గర వడ్లు తీసుకున్నరా? -మాజీ మంత్రి హరీశ్‌రావు

ఆర్టీసీ ఉద్యోగులకు న్యాయమెప్పుడు?

ఆర్టీసీని ప్రభుత్వపరం చేయాలని, సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా చేయాలని నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నన్నదని, అపాయింట్‌మెంట్ డే మాత్రమే ప్రకటించాల్సి ఉన్నదని, అసెంబ్లీలో బిల్లు పాసైనా, గవర్నర్ ఆమోదం తెలిపినా ఏ రోజు నుంచి అమలు చేస్తారో చెప్పలేక ప్రభుత్వం 8 నెలల నుంచి తాత్సారం చేస్తున్నదని హరీశ్ మండిపడ్డారు. ఈ విషయంపై శాసన సభలో పోరాడాలని నిర్ణయించినట్టు తెలిపారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా ఇవ్వకుండా ప్రభుత్వం రైతులను ఇబ్బందులు పెడుతున్నదని, బోనస్ బోగస్ అయిందని మండిపడ్డారు. ఈ అంశాలపైనా చర్చకు పట్టుపడుతామని తెలిపారు. ఎవరెవరు ఏయే సబ్జెక్టులపై మాట్లాడాలనే దానిపై తమ అధినేత కేసీఆర్ దిశానిర్దేశం చేసినట్టు తెలిపారు. పార్టీ ఫిరాయింపులపైనా ప్రత్యేక వ్యూహాన్ని అమలు చేస్తామని తెలిపారు. ఎల్పీ సమావేశానికి కొందరు రాలేదనే ఆరోపణలపై స్పందించిన హరీశ్‌రావు వారు పార్టీకి చెప్పే విదేశాలకు వెళ్లారని వివరించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు, సబితా ఇంద్రారెడ్డి, చింతా ప్రభాకర్, కోవా లక్ష్మి, విజయుడు, ఎమ్మెల్సీలు సత్యవతి రాథోడ్, సురభి వాణిదేవి పాల్గొన్నారు.

బీఏసీ భేటీ సమాచారం ఇవ్వరా?

బీఏసీ సమావేశం గురించి సమాచారం ఇవ్వకపోవడంపై హరీశ్‌రావు అసెంబ్లీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఏసీకి హాజరయ్యే ఎమ్మెల్యేల సమాచారాన్ని తాము ముందస్తుగా అందించినా తమకు సమాచారం ఇవ్వకపోవడంపై మండిపడ్డారు. సభా సంప్రదాయాలను కాపాడేందుకే సభ వాయిదా పడినా వెళ్లకుండా అధికారుల సమాచారం కోసం ఎదురుచూశానని చెప్పారు. గతంలో తాను కూడా శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రిగా పనిచేశానని, సభా సంప్రదాయాలు పాటించాలని సూచించారు. ఈ తరహా పొరపాట్లు మళ్లీ జరగకుండా చూసుకుంటామని అధికారులు సర్దిచెప్పడంతో బీఏసీ భేటీకి వేముల ప్రశాంత్‌రెడ్డితో కలిసి హరీశ్ హాజరయ్యారు.

బడ్జెట్ సమావేశాలు 4 రోజులేనా?

హామీలు ఎత్తివేయడమే కాదు.. శాసన సభ సమయాన్ని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఎత్తివేస్తున్నదని హరీశ్‌రావు ఎద్దేవాచేశారు. అసెంబ్లీని నాలుగు రోజుల్లో ముగించేలా ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. ఇంత తక్కువ సమయంలో బడ్జెట్ సమావేశాలు ముగించిన చరిత్ర ఏనాడూ లేదని గుర్తుచేశారు. మంగళవారం బీఏసీ సమావేశం అనంతరం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డితో కలిసి హరీశ్ మాట్లాడుతూ బడ్జెట్‌పై గతంలో 8 –10 రోజులు చర్చ జరిగేదని, పద్దుల మీద 4రోజుల నుంచి 8రోజుల వరకు మాట్లాడిన సందర్భాలున్నాయని గుర్తుచేశారు. కానీ ఈ సారి రెండు రోజుల్లోనే పద్దులపై చర్చ పెట్టారని, ఒకేరోజు 15–20 పద్దులపై చర్చ జరగాలనే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని చెప్పారు. గతంలో కాంగ్రెస్ నాయకులు 10, 12 రోజులు సమావేశాలు పెట్టినా కొద్ది రోజులే పెడుతున్నారని విమర్శలు చేసేవారని, నెల రోజులు సమావేశాలు నిర్వహించాలని అడిగేవారని గుర్తుచేశారు. 15 రోజులైనా చర్చ జరగాలని బీఏసీలో బీఆర్ఎస్ తరపున డిమాండ్ చేసినట్టు చెప్పారు. అసెంబ్లీ సమావేశాల్లో 9 అంశాలపై చర్చించాలని బీఏసీ దృష్టికి తీసుకుపోయినట్టు తెలిపారు. బుధవారం నిరుద్యోగుల అంశంపై చర్చించాలని కోరినట్టు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో శాంతి భద్రతల వైఫల్యం, చేనేత కార్మికుల ఆత్మహత్యలు, ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత, అంక్షలు లేకుండా రుణమాఫీ, అన్ని పంటలకు బోనస్, రైతు భరోసా, పల్లెలు, పట్టణాల్లో పారిశుద్ధ్య లోపం, స్థానిక సంస్థలకు నిధులు, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులు, పెండింగ్ బిల్లుల విడుదల వంటి తొమ్మిది అంశాలపై సభలో చర్చ పెట్టాలని బీఏసీలో కోరినట్టు తెలిపారు. అసెంబ్లీలో చర్చించాల్సిన ఎజెండాను మంగళవారం నాటికి కూడా ఖరారు చేయలేదని, బుధవారం జరిగే చర్చను మంగళవారం సాయంత్రం నిర్ణయిస్తే ఎలా సిద్ధమవుతారని ప్రశ్నించారు.

గన్‌పార్క్ వద్ద అమరుబీరుల స్తూపానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

అమరులకు నివాళులర్పించి అసెంబ్లీకి..

- తొలిరోజు గులాబీ కండువాలతో సభలోకి
- గన్‌పార్క్‌వద్ద 'జై తెలంగాణ', 'అమరవీరులకు జోహార్లు'
- నినాదాలతో హోరెత్తించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

హైదరాబాద్, జూలై 23 (నమస్తే తెలంగాణ) : శాసనసభ సమావేశాల సందర్భంగా బీఆర్ఎస్ సభ్యులు మంగళవారం గన్‌పార్క్ వద్ద అమరుబీరుల స్తూపానికి నివాళులర్పించారు. 'జై తెలంగాణ', 'అమరవీరులకు జోహార్లు' నినాదాలతో హోరెత్తించారు. అక్కడి నుంచి నడుచుకుంటూ అసెంబ్లీకి చేరుకున్నారు. అందరూ గులాబీ కండువాలు కప్పుకొని అసెంబ్లీలో కూర్చుకున్నారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కడియం శ్రీహరి, గూడెం మహిపాల్‌రెడ్డి, కాలె యాదయ్య చివరి వరుసలో కూర్చున్నారు.

ప్రధాన ప్రతిపక్ష నేతకు ఇదా గది? : కేటీఆర్ అసంతృప్తి

ప్రధాన ప్రతిపక్ష నేతలకు కేటాయించిన గదిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అసంతృప్తి వ్యక్తంచేశారు. ఇది కనీసం కూర్చోవడానికి కూడా అనువుగా లేదని చెప్పారు. గతంలో తాము అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్ష నేతకు ఇచ్చిన గౌరవం, మర్యాదను కాంగ్రెస్ ప్రభుత్వం పాటించడం లేదని, ప్రధాన ప్రతిపక్ష నేతకు ప్రభుత్వం ఇచ్చే గౌరవం ఇదేనా? అని ప్రశ్నించారు. సౌకర్యవంతంగా ఉండే గదిని కేటాయించాలని స్పీకర్‌ను కోరారు.

సంప్రదాయం, ఆనవాయితీని పాటించరా: హరీశ్‌రావు

ప్రతిపక్షంపై కాంగ్రెస్ ప్రభుత్వం వివక్ష కొనసాగిస్తున్నదని బీఆర్ఎస్ ఆరోపించింది. బీఏసీ సమావేశానికి ఆహ్వానాన్ని కూడా సరిగా పంపలేదని విమర్శించింది. గతంలో ఉన్న సంప్రదాయం, ఆనవాయితీని పాటించడంలేదని మాజీ మంత్రి హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ నుంచి మాజీ మంత్రి టీ హరీశ్‌రావు బీఏసీకి హాజరు కావాలని పార్టీ నిర్ణయించగా సమావేశం ఎన్ని గంటలకనే సమాచారాన్ని, ఆహ్వానాన్ని అసెంబ్లీ అధికారులు అందించలేదు. చివరి నిమిషంలో అధికారులు వచ్చి బీఏసీ సమావేశానికి రావాలని చెప్పడంతో వారిపై హరీశ్ రావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇది సరైన పద్ధతి కాదని సూచించారు. గతంలో సభ జరుగుతున్నప్పుడు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి ప్రతిపక్ష నేత వద్దకు వచ్చి చెప్పే వారని, కానీ ఇప్పుడు ఇవేవీ లేకుండా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. భవిష్యత్‌లో పునరావృతం కాకుండా చూడాలని సూచించారు.

అసెంబ్లీ సమావేశాలు 18 రోజులు నిర్వహించాలి

బీజేపీ శాసనసభా పక్ష నేత మహేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 23 (నమస్తే తెలంగాణ) : అసెంబ్లీ సమావేశాలను ప్రభుత్వం నాలుగైదు రోజులు నిర్వహించి ముగించే ప్రయత్నం చేస్తున్నదని బీజేపీ శాసనపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మంగళవారం నిర్వహించిన బీఏసీ సమావేశం తర్వాత ఆయన మీడియా పాయింట్ వద్ద విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాలు కనీసం 18 రోజులైనా నిర్వహించాలని బీఏసీలో డిమాండ్ చేశామని తెలిపారు. ప్రజా సమస్యలు మొత్తం 18 అంశాలపై అసెంబ్లీలో చర్చ జరగాలని కోరినట్టు చెప్పారు. వ్యవసాయ రంగం, సాగునీరు, ఉద్యోగాలు, నిరుద్యోగుల సమస్యలు, మహిళలకు ఇచ్చిన హామీలు, విద్యారంగం, పంచాయతీరాజ్, సంక్షేమం వంటి అంశాలపై చర్చ జరగాల్సి ఉన్నదని తెలిపారు. కేంద్ర బడ్జెట్ దేశ శ్రేయస్సును కోరేదిగా ఉన్నదని అభిప్రాయపడ్డారు.

కాంగ్రెస్‌ను ఉతుకుడే!

మొదటిపేజీ తరువాయి...

చేస్తామన్న రైతురుణమాఫీ ఇప్పుడు మొదలుపెట్టారని, చెప్పినదానికి, చేస్తున్నదానికి పొంతనేలేదని విమర్శించారు. రైతులకు రుణమాఫీ కావడంలేదని, రైతుభరోసా ఇస్తామని చెప్పినా ఇప్పటి వరకు అందలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగాల కోసం నిరుద్యోగులు రోడ్లపైనే పోరాటం చేస్తున్నారని గుర్తుచేశారు. ఉద్యోగుల డీఏ, పీఆర్‌సీపై ఇప్పటికీ ప్రభుత్వం ప్రకటన చేయలేదని మండిపడ్డారు. కరెంటు విషయమైతే చెప్పాల్సిన పనేలేదని, కరెంటు సక్కగా వస్తున్నదని ఒక్కళ్లు కూడా చెప్తలేరని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై పోరాటం చేద్దామని, ప్రజలతోనే పార్టీ నాయకులు, కార్యకర్తలు పనిచేయాల్సిన అవసరం ఉన్నదని సూచించారు. పోరాట కార్యక్రమాలను రూపొందించుకుందామని, త్వరలోనే పార్టీ కార్యవర్గాలను, పార్టీ నిర్మాణాన్ని చేసుకుందామని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేశారు. ప్రజల అండ, కార్యకర్తల బలం బీఆర్ఎస్‌కు ఉన్నంతకాలం పార్టీని ఎవ్వరూ ఏమీ చేయలేరని కేసీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణకు క్లిష్ట పరిస్థితులు అంటూ లేవని, ఉన్నవి ఇష్ట పరిస్థితులేననే విషయాన్ని గమనంలోకి తీసుకొని పార్టీ శ్రేణులు ముందుకు సాగాలని దిశానిర్దేశం చేశారు. రాదనుకున్న తెలంగాణను కొట్లాడి సాధించుకున్నామని, రాజకీయాల్లో చంద్రబాబు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వంటివారితోనే కొట్లాడామని గుర్తు చేశారు. తెలంగాణ రాకను అడ్డుకునే ప్రయత్నం చేయడమే కాకుండా పార్టీని కూడా వారు మింగేసే ప్రయత్నం చేశారని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై పోరాటం చేద్దామని, బీఆర్ఎస్‌కు ఎదురు ఉండదని పేర్కొన్నారు.

పార్టీ మారిన వారి గురించి ఆలోచన వద్దు

కొంతమంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పార్టీ మారారని, వారి గురించి ఆలోచించవద్దని కేసీఆర్ పేర్కొన్నట్టు సమాచారం. ఒక్కొక్కరికి రెండు, మూడుసార్లు పదవులు ఇచ్చామని, ఏం తక్కువ చేశామని ప్రశ్నించినట్టు తెలిసింది. పార్టీ మారిన వారు వారి భవిష్యత్తును వాళ్లే నాశనం చేసుకున్నారని పేర్కొన్నారు. పోచారం గురించి సమావేశానికి వచ్చిన వారు ప్రస్తావించగా ఆయనకు ఇంతకన్నా ఎక్కువ ఏం చేస్తామని అన్నట్టు తెలిసింది. రెండుసార్లు టికెట్ ఇచ్చిన వాళ్లకు మరోసారి వద్దు అని చాలామంది తనతో చెప్పారని, కానీ, తానే పట్టుపట్టి మరీ టికెట్ ఇచ్చి గెలిపించుకున్నానని, అలాంటివాళ్లు ఇప్పుడు పార్టీ మారారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ ఫిరాయించిన వారిపై న్యాయపోరాటం కొనసాగుతుందని, ఇప్పటికే కేసులు వేశామని, దీనిపై కార్యాచరణ రూపొందిస్తామని వెల్లడించారు. 24 ఏండ్లలో పార్టీ అనేకమందిని చూసిందని, ఎంతోమంది కొత్త నాయకులను తయారు చేసిన పార్టీ అని చెప్పారు. ఇప్పుడు కూడా కొత్త నాయకత్వాన్ని తయారు చేసుకుంటామని చెప్పారు. నేటి కార్యకర్తలే రేపటి నాయకులు అని స్పష్టం చేశారు. కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

మల్లన్న.. కొట్లాడుదాం

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం తప్పదని, కొట్లాడేందుకు సిద్ధమవ్వాలని పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కేసీఆర్ పిలుపునిచ్చారు. ఎన్ని రోజులు ఇబ్బంది పెడతారో చూద్దామని, ప్రజల కోసం చేసే పోరాటంలో కొన్ని ఆటుపోట్లు తప్పవని, అందుకు మానసికంగా సిద్ధం కావాలని దిశానిర్దేశం చేశారు. మాజీమంత్రి మల్లారెడ్డిని ఉద్దేశించి.. 'మల్లన్నా..కొట్లాడుదామా' అని కేసీఆర్ ప్రశ్నించగానే ఆయన స్పందిస్తూ కొట్లాడుదామని బదులిచ్చారు. పార్టీ సమగ్ర కార్యాచరణను రూపొందిస్తున్నదని, ప్రజల సమస్యలను తీసుకొని పోరాటాలకు రూపునిస్తుందని చెప్పారు.

నేనూ అసెంబ్లీకి వస్తా

తాను కూడా అసెంబ్లీకి వస్తానని, బడ్జెట్ సందర్భంగా ఏం చెప్తారో చూద్దామని కేసీఆర్ పేర్కొన్నారు. కాళేశ్వరంపై దుష్ప్రచారమే ఎక్కువ జరిగిందన్నారు. సుందిళ్లలో పుష్కలంగా నీళ్లు ఉన్నాయని మాజీ మంత్రి గంగుల కమలాకర్ చెప్పారు. పార్టీ బృందం ఒకసారి మేడిగడ్డకు వెళ్లి వస్తే బాగుంటుందని ఎమ్మెల్యేలు ప్రతిపాదించారు. కేసీఆర్ కూడా అందుకు సరేనన్నారు. బడ్జెట్ సమావేశాలు పూర్తి అయిన తరువాత అయిన ఎమ్మెల్యేల బృందం మేడిగడ్డ సందర్శనకు వెళ్లాలని నిర్ణయించారు.

> గడచిన 24 ఏండ్లలో ఎంతోమంది నాయకులను తయారుచేసుకున్నం. ఇప్పుడు కూడా కొత్త నాయకత్వాన్ని తయారుచేసుకుందం. నేటి కార్యకర్తలే రేపటి నాయకులు. -కేసీఆర్

శాసనమండలి పక్షనేతగా సిరికొండ

శాసనమండలిలో ప్రతిపక్ష నేతగా పార్టీ వ్యవస్థాపక సభ్యుడు, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారిని నియమిస్తున్నట్టు పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ ప్రకటించారు. పార్టీ శాసనసభా పక్ష సమావేశంలోనే మధుసూదనాచారి పేరును ఆయన ప్రకటించారు. పార్టీ కోసం పనిచేయాలని, రాష్ట్రస్థాయి సమస్యలపై పోరాటం చేయాలని, భూపాలపల్లి నియోజకవర్గంలో గండ్ర వెంకటరమణరెడ్డి పనిచేసుకుంటారని, ఆయనతో సమన్వయం చేసుకోవాలని సిరికొండకు సూచించారు. భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జిగా, పార్టీ అభ్యర్థిగా గండ్రనే ఉంటారని కేసీఆర్ స్పష్టం చేసినట్టు తెలిసింది. పార్టీ కోసం పనిచేసే వారికి పార్టీ ఎప్పటికీ అండదండగా ఉంటుందని చెప్పారు. సమావేశం నుంచే మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణరెడ్డికి పార్టీ నాయకులతో కేసీఆర్ ఫోన్ చేయించి మధుసూదనాచారికి పార్టీ శాసనసభాపక్ష నేత పదవి ఇస్తున్నట్టు సమాచారం అందించారు. మధుసూదనాచారి రాష్ట్రస్థాయి పదవిలో కొనసాగుతారని, ఆయనకు పార్టీలో సముచిత స్థానం కల్పిస్తున్నట్టు తెలిపారు.

బడ్జెట్‌పై చర్చకు హరీశ్‌రావు

శాసనసభలో బడ్జెట్‌పై జరిగే చర్చలో పార్టీ తరపున హరీశ్‌రావు మాట్లాడతారని కేసీఆర్ తెలిపారు. ద్రవ్యవినిమయ బిల్లుపై కేటీఆర్, రైతు రుణమాఫీ, రైతు భరోసాపై పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతారని, పార్టీ తరపున ప్రతీ ఒక్కరు మాట్లాడాలని, మంత్రులుగా పనిచేసిన జగదీశ్‌రెడ్డి వంటివారు బాగా మాట్లాడుతున్నారని ఇదే ఒరవడిని కొనసాగించాలని సూచించారు. ప్రతి ఒక్కరు ఒక్కో సబ్జెక్టు తీసుకొని మాట్లాడాలన్నారు. సబితా ఇంద్రారెడ్డి విద్యపై మంచిగా మాట్లాడతారని, గంగుల కమలాకర్ సివిల్ సప్లయ్స్‌తో ప